క్లుప్తంగా

ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాలు ప్రారంభం

దండేపల్లి/మంచిర్యాలటౌన్: ఎస్‌బీఐ బ్యాంక్ సౌజన్యంతో మహిళలకు గ్రామ స్వరాజ్య స్వచ్ఛంద సంస్థ తరుపున జిల్లా కేంద్రంలోని 13వ వార్డు హమాలివాడలో, దండేపల్లి మండలం గూడెం గ్రామంలో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాలను శనివారం జిల్లా కోఆర్డినేటర్ గుండా సంధ్యారాణి ఆధ్వర్యంలో ప్రారంభించారు. నెల రోజుల పాటు ఉచితంగా శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్ అందించనున్నట్లు తెలిపారు. ట్రైనర్ తుమ్మ సంధ్యారాణి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ సల్ల మహేశ్, సీవో సరోజ, ఆర్పీ ఇందిర, వాలంటరీ ట్రైనర్ అశ్విని తదితరులు పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్ ఎదుట ధర్నా

వేమనపల్లి: ఇటీవల మరణించిన నాయిని కన్నయ్య కుటుంబానికి న్యాయం చేయాలని ఈ నెల 28న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలంగాణ ఆదివాసీ సంఘం జిల్లా కార్యదర్శి ఎర్మ పున్నం పిలుపునిచ్చారు. 23రోజులు గడుస్తున్నా కలెక్టర్, నియోజకవర్గ ఎమ్మెల్యే, ఐటీడీఏ పీవో పట్టించుకోకపోవడం దారుణమన్నారు. పెత్తందారుల మూలంగా ఆదివాసీ గిరిజనుడు మృతి చెందితే తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయిని కన్నయ్య భార్య స్వరూప, టీఏజీఎస్ జిల్లా నాయకులు శంకర్, పోశం, రాజేశ్వరి, ఉమారాణి పాల్గొన్నారు.

సెల్‌టవర్ ఏర్పాటు చేయొద్దు



ఆందోళన చేస్తున్న కాలనీవాసులు

మంచిర్యాలఅగ్రికల్చర్: నస్పూర్ అభినవ కాలనీలో ఓ ఇంటిపై సెల్‌టవర్ ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ శనివారం పిల్లలు, మహిళలు, కాలనీవాసులంతా కలిసి నిరసన ర్యాలీ చేపట్టారు. కలెక్టరేట్ ఎదుట ప్లకార్డులతో ధర్నా చేశారు. జనావాసాల మధ్య సెల్‌టవర్ పెట్టడం వల్ల రేడియేషన్‌కు గురై అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందని, వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని సెల్ టవర్ నిర్మాణాన్ని కాలనీ నుంచి ఇతర మైదాన ప్రాంతానికి తరలించాలన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు.

‘41కిలోలే ధాన్యం తూకం’

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో ధాన్యం సేకరణ తూకంపై ‘42 కిలోలైతే ఓకే’ శీర్షికన ‘సాక్షి’లో శనివారం ప్రచురితమైన కథనంపై జిల్లా అధికారులు ధాన్యం స్పందించారు. కొనుగోలు కేంద్రాలు పరిశీలించి ధాన్యం బస్తా 42 కిలోలు తూకం వేయడం లేదని, 41 కిలోలు మాత్రమే వేస్తున్నారని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి కిషన్ తెలిపారు. తేమ, తాలు, తరుగు, గన్ని బ్యాగుబరువు అన్నీ పరిశీలించాకే 41కిలోలు తూకం వేయడం జరుగుతుందని తెలిపారు. జన్నారం, దండేపల్లి మండలాల్లోని ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో నిబంధనల మేరకు ధాన్యం సేకరిస్తున్నామని, ఎక్కడైనా తరుగు పేరుతో అధికంగా ధాన్యం సేకరిస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

బార్లకు 16 దరఖాస్తులు

మంచిర్యాలక్రైం: జిల్లాలో రెండు కొత్త బార్ల నిర్వహణకు దరఖాస్తు గడువు శనివారం ముగిసిందని జిల్లా ఎక్సైజ్ అధికారి కేజీ.నందగోపాల్ తెలిపారు. ఈ నెల 3నుంచి 26వరకు దరఖాస్తులు స్వీకరించగా.. మంచిర్యాల బార్‌కు 15, బల్లంపల్లి బార్‌కు ఒక దరఖాస్తు వచ్చాయని పేర్కొన్నారు. దరఖాస్తుల రూపంలో రూ.16లక్షలు ఆదాయం సమకూరిందని తెలిపారు. లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తామని, ఎంపికైన వారు ఏడాదికి రూ.42లక్షలు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న వెంకటేశ్వర్‌గౌడ్

వేమనపల్లి: తాటిచెట్టుపై నుంచి పడి మరణించిన దస్నాపూర్‌కు చెందిన గీత కార్మికుడు తాళ్లపల్లి రాకేష్‌గౌడ్ కుటుంబానికి అండగా ఉంటామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు ముకేష్‌గౌడ్ అన్నారు. శనివారం దస్నాపూర్‌లోని రాకేష్‌గౌడ్ ఇంటికి వెళ్లి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు కిషోర్, సురేష్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్, మురళీధర్, వెంకటేశ్వర్‌రావు, బీజేపీ మండల అధ్యక్షుడు ఏట మధుకర్, నాయకులు మధునయ్య, అజయ్, కిషోర్, చరణ్‌రాజ్ తదితరులు ఉన్నారు.

మట్టి పాత్రలపై ఆసక్తి

సండే స్పెషల్



మంచిర్యాల మార్కెట్‌లో రంజన్లు, కుండలను కొనుగోలు చేస్తున్న ప్రజలు



మంచిర్యాలటౌన్: సహజసిద్ధంగా మట్టి పాత్రలలో బయటి వాతావరణంతో చల్లబడే తాగునీటిని తాగితే ఆరోగ్యానికి మంచిదని ప్రజలు రంజన్లు, కుండలను ఎక్కువగా వినియోగిస్తున్నారు. ఏటా వేసవికాలం వచ్చిందంటే చాలు ఆదిలాబాద్‌లో తయారు చేసిన రంజన్లు, రాజస్థాన్‌లో తయారు చేసిన కుండలకు జిల్లాలో గిరాకీ ఎక్కువగా ఉంటోంది. ఆదిలాబాద్ రంజన్లు అంటే చల్లని నీటిని అందించేందుకు ఎంతో పేరున్నవి. వీటిని ఏటా మంచిర్యాలకు పెద్ద ఎత్తున తీసుకొచ్చి అమ్మకాలు చేపడుతున్నారు. రాజస్థాన్ నుంచి వచ్చే కుండలు, ఇతర మట్టి పాత్రలు ఎక్కువగా అమ్ముతున్నారు. రంజన్లు రూ.250నుంచి రూ.500వరకు ధరలు ఉండగా, కుండలు రూ.150నుంచి రూ. 450వరకు ఉన్నాయి. వీటికి ట్యాప్‌లను అమరిస్తే ధర మరికాస్త ఎక్కువగా ఉంటుంది. మట్టి జగ్గులు రూ.300ల వరకు ఉండగా, మట్టి గ్లాసులు రూ.30నుంచి రూ.60, కూజలు రూ.120 వరకు అమ్ముతున్నారు.



మట్టితో చేసిన వాటర్ బాటిళ్లు



అమ్మకానికి ఆదిలాబాద్ రంజన్లు

భూ సమస్యల పరిష్కారానికే ‘భూ భారతి’

- కలెక్టర్ కుమార్‌దీపక్

నెన్నెల: భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందని, రైతులు అవగాహన పెంచుకొని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కుమార్‌దీపక్ పేర్కొన్నారు. రైతువేదికలో శనివారం నిర్వహించిన భూ భారతి చట్టం అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ చట్టంతో రైతుల సమస్యలు పరిష్కరించడమే కాకుండా, భూధార్ కార్డులను ప్రభుత్వం అందిస్తుందని, భూముల వివరాలు తెలుస్తాయని చెప్పారు. ధరణి పోర్టల్‌లో జరిగిన తప్పులను భూ భారతిలో సరిచేసుకునే అవకాశం ఉందన్నారు. రైతులు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే భూ భారతి విజయవంతమవుతుందన్నారు. ఈ చట్టంతో రైతులతో పాటు భూములు కొనుగోలు చేసే ప్రతి ఒక్కరికి మేలు జరుగుతుందన్నారు. వారసత్వం, ప్రభుత్వ, అటవీ, అసైన్డ్, వ్యవసాయేతర, శిఖంలాంటి భూముల వివరాలు స్పష్టంగా తెలుస్తాయన్నారు. కోర్టులను ఆశ్రయించకుండా, భూ సమస్యలు పరిష్కరించే వెసులుబాటును భూ భారతి చట్టం తీసుకొచ్చిందన్నారు. భూ భారతి చట్టంతో రైతుల భూములకు పటిష్టమైన రక్షణ ఉంటుందన్నారు. నెన్నెల మండలంలో పోడు భూముల సమస్య ఉందని, ప్రభుత్వ భూములను సాగు చేయకుండా అటవీ అధికారులు అడ్డుకుంటూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని నాయకులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా స్పందించిన ఆయన త్వరలోనే జాయింట్ సర్వే చేయించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మోతీ లాల్, జిల్లా వ్యవసాయాధికారిణి కల్పన, బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, తహసీల్దార్ మహేంద్రనాథ్, ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మేకల మల్లేష్, కాంగ్రెస్ నాయకులు మల్లేష్, హరీష్, శ్రీనివాస్ ఉన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్‌దీపక్

ముగిసిన చర్చి జాతర





లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని మిషన్ కాంపౌండ్‌లో రెండు రోజులుగా కొనసాగుతున్న సీఎస్ఐ చర్చి ఏసుక్రీస్తు పునరుత్థాన ప్రాంతీయ జాతర శనివారం ముగిసింది. భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

నివాళులు.. ర్యాలీలు



బెల్లంపల్లి/కాసిపేట/పాతమంచిర్యాల/చెన్నూర్ రూరల్/మంచిర్యాలటౌన్: జమ్ముకశ్మీర్‌లోని పహెల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో మృతి చెందిన పర్యాటకులకు సింగరేణి కార్మికులు శ్రద్ధాంజలి ఘటించారు. మందమర్రి ఏరియా శాంతిఖని, కాసిపేట గనులపై శనివారం టీబీజీకేఎస్, ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో వేర్వేరుగా కొవ్వొత్తులతో ర్యాలీ తీశారు. రెండు నిమిషాల మౌనం పాటించారు. జిల్లా కేంద్రంలో సీపీఐ, ఫిట్‌నెస్ సెంటర్ ఆధ్వర్యంలో, చెన్నూర్ మండలంలోని కిష్టంపేటలో బీజేపీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ సీనియర్ నాయకుడు మేడిపల్లి సంపత్, కేంద్ర కమిటీ సభ్యులు రమణ, శ్రీనివాస్, బడికెల రమేష్, ఏరియా ఉపాధ్యక్షుడు ఏ.రవికిరణ్, ఫిట్‌సెక్రెటరీ హన్మంతరావు, ఐఎన్టీయూసీ కేంద్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ కాంపెల్లి సమ్మయ్య, ఐఎన్టీయూసీ మందమర్రి బ్రాంచి వైస్ ప్రెసిడెంట్ దేవి భూమయ్య, కేంద్ర కమిటీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ నరేంద్రనాయుడు, కేంద్ర కమిటీ డెప్యూటీ జనరల్ సెక్రెటరీ మిట్ట సూర్యనారాయణ, జిల్లా కేంద్రంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, మేకల దాసు, ఖలీందర్ ఆలీఖాన్, రేగుంట చంద్రశేఖర్, తులా ఆంజనేయులు, ఫిట్‌నెస్ సెంటర్ సభ్యులు దార కుమారస్వామి, చంద్రకాంత్, శ్రీనాథ్, అశోక్, బాక్సింగ్ కోచ్ రాజేశ్, శ్రీకాంత్, చెన్నూర్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు రాపర్తి వెంకటేశ్వర్లు, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏతం శివకృష్ణ, మండల అధ్యక్షుడు బుర్ర రాజశేఖర్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి దుర్గం రాజబాపు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన వార్షికోత్సవం



వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు, తల్లులు

బెల్లంపల్లి: మున్సిపాలిటీ పరిధి శాంతిఖని–3 అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం వార్షికోత్సవం నిర్వహించగా, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆట పాటలతో అలరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ గోలి.రాజేశ్వరి, చిన్నారులు, తల్లులు, బస్తీవాసులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

- పరిసరాల పరిశుభ్రతపై ఆరా
- పౌష్టికాహారం అందించాలని సూచన

జన్నారం: మండలంలోని రేండ్లగూడ 2వ అంగన్‌వాడీ సెంటర్‌ను మంచిర్యాల జిల్లా సంక్షేమాధికారి రవుఫ్‌ఖాన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిసర ప్రాంతాలను పరిశీలించారు. మెనూ ప్రకారం ఇస్తున్న ఆహారం, ప్రీస్కూల్ నిర్వహణ గురించి ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు. టీచర్లు, హెల్పర్ సమయపాలన పాటించి విద్యార్థులకు పౌష్టికాహారం అందేలా చూడాలని సూచించారు. సీడీపీవో రేష్మా, సూపర్‌వైజర్ కవిత ఉన్నారు.

పౌష్టికాహారం అందించాలి

లక్సెట్టిపేట: అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిశుభ్రతను పాటించాలని ఐసీడీఎస్ జిల్లా అధికారి రవుఫ్‌ఖాన్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఊత్కూరు అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అన్ని విధాల మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు. పౌష్టికాహారం అందించాలని సూచించారు. రిజిస్టర్లు పరిశీలించారు. కార్యక్రమంలో సీడీపీవో రేష్మ, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న రవుఫ్‌ఖాన్

‘కాంగ్రెస్ ప్రభుత్వం అట్టర్ ఫ్లాప్’

మందమర్రిరూరల్: ప్రజాపాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం అట్టర్ ఫ్లాప్ అయిందని, వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ప్రజలు పట్టం కట్టడానికి సిద్ధంగా ఉన్నారని మాజీ ప్రభుత్వ విప్, చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ అన్నారు. బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ విజయవంతం చేయాలని మందమర్రిలో శనివారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాత బస్టాండ్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ సర్ విగ్రహానికి పూలమాల వేసి బైక్ ర్యాలీ నిర్వహించారు. బీఆర్‌ఎస్ పార్టీ, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

మంచిర్యాలటౌన్: భారత రాష్ట్ర సమితి(బీఆర్‌ఎస్) పార్టీ ఏర్పాటు చేసి 25ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా కేంద్రంలో శనివారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు బైక్ ర్యాలీ నిర్వహించారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ రావు, మాజీ ప్రజాప్రతినిధులు, టీబీజీకేఎస్ నాయకులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న మాజీ ప్రభుత్వ విప్ బాల్క సుమన్

‘తపస్’ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

మంచిర్యాలఅర్బన్: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) ఆధ్వర్యంలో స్థానిక సరస్వతీ శిశుమందిర్ ఆవరణలోని తపస్ కార్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 37మంది రక్తదానం చేశారు. ఉత్సాహంగా రక్తదానం చేసేందుకు వచ్చిన సమగ్రశిక్ష కో–ఆర్డినేటర్లు సత్యనారాయణ మూర్తి, చౌదరి, రాజ్‌కుమార్‌లను రెడ్‌క్రాస్‌సొసైటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి, మహేందర్ అభినందించారు. వచ్చే సంవత్సరం నుంచి తపస్ నిర్వహించే కార్యక్రమాల్లో భాగంగా ఒకరోజు రక్తదాన కార్యక్రమం నిర్వహిస్తామని తపస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరావు, బగ్గని రవికుమార్ ప్రకటించారు. శిబిరంలో పాల్గొన్న ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో టీజీఎంసీ వైద్యుడు శ్రీనివాస్, వైద్యుడు వికాస్, తపస్ జిల్లా బాధ్యులు నీలేశ్‌కుమార్, విద్యాసాగర్, భారతీ అశోక్, రూపాచారి, రమేశ్, మహిళా ఉపాధ్యక్షురాలు రమాదేవి, రాజలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరంలో ఉపాధ్యాయులు

చదువుతోపాటు ఆటల్లో రాణించాలి

- జీఎం శ్రీనివాస్
- వేసవి క్రీడా శిబిరం ప్రారంభం

శ్రీరాంపూర్: విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో రాణించాలని శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్ తెలిపారు. నస్పూర్ నాగార్జున కాలనీలోని ప్రాణహిత స్టేడియంలో కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆటల వల్ల శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, అథ్లెటిక్స్, బాక్సింగ్‌లలో నిష్ణాతులైన శిక్షకులచే క్రీడల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు. మైదానంలో ఓపెన్ జిమ్‌ను ప్రారంభించారు. ప్రాణహిత మైదానంలో వాకింగ్ ట్రాక్ సరిగ్గా లేదని, మైదానం ఎత్తు పల్లాలుగా ఉందని, లైటింగ్ సరిగ్గా లేదని కాలనీవాసులు, క్రీడాకారులు జీఎంకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమాల్లో గుర్తింపు ఏఐటీయూసీ బ్రాంచీ సెక్రెటరీ ఎస్కే బాజీసైదా, ఏజెంట్ వెంకటేశ్వర్లు, డీజీఎం అరవిందరావు, ఎస్సార్పీ 3 గని మేనేజర్ వెంకట్రావు, సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి, ఎన్విరాన్‌మెంట్ అధికారి హనుమాన్‌గౌడ్, సివిల్ ఈఈ సత్యనారాయణ, స్పోర్ట్స్ గౌరవ కార్యదర్శి పాల్ సృజన్, సూపర్‌వైజర్ చాట్ల అశోక్, కో ఆర్డినేటర్ నర్సయ్య, ఇండోర్ కెప్టెన్ తోట సురేశ్ పాల్గొన్నారు.



ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న జీఎం శ్రీనివాస్

కేకే-ఓసీని సందర్శించిన డైరెక్టర్

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని కేకే–ఓసీని శనివారం సింగరేణి డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్) వెంకటేశ్వర్లు ఏరియా జీఎం దేవేందర్‌తో కలిసి సందర్శించారు. పని ప్రదేశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. గనిలో ఉత్పత్తి, ఉత్పాదకతపై జీఎంను అడిగి తెలుసుకున్నారు. రక్షణతో కూడిన ఉత్పత్తి లక్ష్య సాధనకు ,కృషి చేయాలన్నారు. అధికారులకు పలు సూచనలు చేశారు. బెల్లంపల్లి రీజనల్ సేఫ్టీ జీఎం రఘుకుమార్, ఎస్వోటు జీఎం విజయ్‌ప్రసాద్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ రవీందర్, కేకే–గ్రూప్ ఏజెంట్ రాంబాబు, ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ మల్లయ్య ఉన్నారు.

ఎస్టీపీపీ ఈడీకి సన్మానం

జైపూర్: జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ ఈడీ చిరంజీవిని ఎస్టీపీపీ ఐఎన్టీయూసీ అధ్యక్షుడు పేరం రమేశ్ ఆధ్వర్యంలో కార్మికులు, నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ప్లాంటులో డ్రైవర్‌గా పనిచేసి రోడ్డు ప్రమాదంలో మరణించిన కానుగంటి శంకర్ కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తొగరి కృష్ణ, రామగిరి మల్లేశ్, ఎలుక రమేశ్, శ్రావణ్‌కుమార్, గూడ మనోజ్, గోన నరేశ్, తిరుపతిరెడ్డి, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

డైరెక్టర్‌కు బీఎంఎస్ వినతి

శ్రీరాంపూర్: సింగరేణి డైరెక్టర్(పా, పీపీ) వెంకటేశ్వర్లుకు బీఎంఎస్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. రామగుండం పర్యటనకు వచ్చిన ఆయన్ను శనివారం సింగరేణి గెస్ట్‌హౌస్‌లో బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కారుణ్య ఉద్యోగాల్లో డిపెండెంట్‌ల వయసు 35సంవత్సరాల నుంచి 40సంవత్సరాలకు పెంచుతూ ఉత్తర్వులు జారీచేసిన కూడా, చాలా ఏరియాల్లో అధికారులు ఈ పెండింగ్ కేసులను విచారణ పూర్తి చేసి ఉద్యోగాలు కల్పించడంలో జాప్యం చేస్తున్నారన్నారు. దీనివల్ల చాలా మంది నెలలు తరబడి ఉద్యోగాల చేరలేకపోతున్నారన్నారు. దీనిపై వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఆ యూనియన్ ప్రధాన కార్యదర్శి యతిపతి సారంగపాణి, శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్ రెడ్డి, నాయకులు రాగం రాజేందర్, కిరణ్ కుమార్, చల్ల వేణు, రాజేష్ కుమార్, వేణుగోపాల్, గోలివాడ రమేష్ పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

మందమర్రిరూరల్: కార్మికులు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సింగరేణి మెడికల్ ఆఫీసర్ లోక్‌నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఏరియాలోని కేకే–5 గనిపై ఎండ తీవ్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి శనివారం గని మేనేజర్ శంభునాథ్ పాండే ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కార్మికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధికారులు, యూనియన్ ప్రతినిధులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

ఇందిరమ్మ ఇళ్ల సర్వే

మంచిర్యాలటౌన్: మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల కోసం అధికారులు సర్వే చేస్తున్నారు. గతంలోనే సర్వే చేసి అర్హులను ఎంపిక చేయగా, మరోసారి ఇంటి స్థలం ఉండి, ఇళ్లు లేని వారు ఎంత మంది ఉన్నారని క్షేత్రస్థాయిలో అధికారులు సర్వేను నిర్వహించి వివరాలను నమోదు చేస్తున్నారు. ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లను మంజూరు చేస్తుండగా, మొదటగా ఇంటి స్థలం ఉండి ఇళ్లులేని నిరుపేదలను గుర్తించి, వారికి అవకాశం కల్పించేందుకు అధికారులు చర్యలను తీసుకుంటున్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

లక్సెట్టిపేట: ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఈ నెల 27న మంచిర్యాలలో నిర్వహించే కార్మిక సదస్సు పోస్టర్‌ను స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం ఆవిష్కరించారు. మే డే నిర్వహణపై చర్చించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మేకల దాసు, మేదరి దేవవరం, రమణారెడ్డి, కిరణ్, బానుచందర్, రాజ న్న, సత్య, ఐలయ్య, బాలయ్య, లచ్చన్న, వెంకటేశ్, కుమార్ పాల్గొన్నారు.

నెన్నెల: మే 1న కార్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నం తిరుపతి పిలుపునిచ్చారు. నెన్నెలలో శనివారం మేడే పోస్టర్ ఆవిష్కరించారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

కోటపల్లి: మండలంలోని పాఠశాలలో, ప్రధాన కూడళ్లలో, కాలనీల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సీఐ సుధాకర్ అన్నారు. దేవులవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించి సీఐ, ఎస్సై రాజేందర్ ప్రారంభించారు.

అంబలి కేంద్రం ప్రారంభం

శ్రీరాంపూర్/మంచిర్యాలటౌన్: కొక్కిరాల రఘుపతిరావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ బస్టాండ్ వద్ద ప్రేమ్‌సాగర్ అన్న అంబలి కేంద్రం, మంచిర్యాల జిల్లా కేంద్రంలో చలివేంద్రాలను శనివారం డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రారంభించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ సుర్మిల వేణు, మంచిర్యాల కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నరేశ్, నాయకులు పాల్గొన్నారు.

లబ్ధిదారులను కలిసిన చైర్మన్

దండేపల్లి: మండలంలోని అల్లీపూర్‌లో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులను రాష్ట్ర గిరిజన సహకార చైర్మన్ తిరుపతి శనివారం కలిశారు. త్వరగా ముగ్గులు పోసుకొని ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.